# కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలి.
# పాతపెన్షన్ అమలు చేయాలి.
# అక్టోబర్ 1న చలో హైదరాబాద్ విజయవంతం చేయండి.

"ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ పొందటం ఉద్యోగి హక్కు. అది పాలకుల దయాదాక్షిణ్యాలతో వేసే భిక్షకాదు. మూడు దశాబ్దాలపాటు సేవచేసి రిటైరైన ఉద్యోగులకు, వారి కుటుంబాలకు సామాజిక భద్రతను కల్పించటం ప్రభుత్వ బాధ్యత". అని 1982లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. కానీ భారత రాజ్యాంగం కంటే న్యాయవ్యవస్థకంటే ప్రపంచ బ్యాంకు ఆదేశాలకే విలువనిచ్చే పాలకులు పెన్షన్‌ను ప్రైవేటీకరించి ఉద్యోగుల ప్రయోజనాలను మార్కెట్ శక్తులకు తాకట్టు పెట్టారు.

భారతదేశంలో 1991 నుండి అమలు చేస్తున్న నూతన ఆర్థిక విధానాలలో భాగంగా, ప్రపంచ బ్యాంకు, బహుళ జాతి సంస్థల, భారత పారిశ్రామిక, వాణిజ్య వర్గాల ఒత్తిడితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలులోకి తెచ్చారు. దీన్ని నిర్వహించడానికి Pension Fund Regulatory Development authority 2004 అను స్వయం ప్రాతినిధ్య సంస్థను భారత ప్రభుత్వం ఒక విధాన ప్రకటన ద్వారా 23-08-2003న ఏర్పరచింది. వాజ్‌పేయిగారి (BJP) నేతృత్వంలోని NDA ప్రభుత్వము 22-12-2003 నాడు PFRDA ఆర్డినెన్స్ ద్వారా CPS నోటిఫికేషన్ జారీచేసి 01-01-2004 నుండి నియమించబడిన కేంద్రప్రభుత్వ ఉద్యోగులను ఈ నూతన పెన్షన్ విధానములోకి తీసుకువచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జి.ఓ.లు 653,654,655లను 22.09.2004న ఏకపక్షంగా తీసుకువచ్చి 01.09.2004 నుండి నియామకమైన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమలు పరిచారు.

UPA ప్రభుత్వ హాయాంలో 6-9-2013న లోక్‌సభలో, 9-9-2013న రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందింది. చట్టం ఆమోదం కొరకు ఓటింగ్ జరిగినపుడు ప్రతిపక్షంలో ఉన్న బి.జె.పి. కూడా అనుకూలంగా ఓటు వేసింది. ఈ చట్టాన్ని బిజెపి మరియు కాంగ్రెసు పార్టీలు కలసి అమలులోకి తెచ్చాయనే విషయము మన గమనంలో యుండాలి. 1-02-2014న భారత ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురితమై చట్టరూపం దాల్చింది. 2003లో రూపొందించిన చట్టం పార్లమెంటులో 2013లో ఆమోదించబడింది. 10 సం॥రాల కాలం చట్టం కాకుండా వామపక్షాలు అడ్డుకున్నాయి. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గిన తర్వాతనే చట్టం ఆమోదించబడింది.

ఏటా లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీ రూపంలో రకరకాల సబ్సిడీల ద్వారా లబ్ధి పొందుతున్న భారత పెట్టుబడిదారి వర్గాలకు, బహుళ జాతి సంస్థలకు లాభం చేకూర్చే విధంగా పెన్షన్ నిధుల రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించారు. లక్షల కోట్ల రూపాయలను విదేశీ గుత్త సంస్థలకు పల్లెంలో పెట్టి అందించడం కొరకే ఈ పథకం ప్రవేశపెట్టారు. ఈ విధానం **"కాకులను కొట్టి గద్దలకు వేసినట్టు"**గా ఉన్నది.

PFRDA బిల్లు 2011పై యశ్వంతసిన్హా అధ్యక్షతన ఏర్పడిన పార్లమెంటరీ స్థాయి సంఘం చేసిన సిఫారసులు (1) ఉద్యోగులు అత్యవసర సమయాలలో పెన్షన్ నుండి కొంత డబ్బును విత్‌డ్రా చేసుకునే అవకాశం, (2) విదేశి పెట్టుబడులు 26%నికి మించరాదని, (3) PFRDAలో ఉద్యోగ సంఘాల మరియు చందాదారుల ప్రతినిధులను సభ్యులుగా నియమించాలనే అంశాలను ప్రభుత్వం బడ్జెట్‌లో చేర్చలేదు.

కాంట్రిబ్యూటరీ అనే పదము బాగాలేదనే కారణంతో జాతీయ పెన్షన్ పథకం (NPS)గా పేరు మార్చారు. వాస్తవంగా పాత పెన్షన్ పథకాన్ని "జాతీయ పెన్షన్ పథకము" అనటం సబబు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల జీతాలనుండి మినహాయింపులుచేసి, వారి డబ్బునే వారికి పెన్షన్‌గా ఇచ్చేది జాతీయ పెన్షన్ ఎలా అవుతుంది? ఇది "పేరుగొప్ప ఊరుదిబ్బ" అన్న చందంగాయున్నది. చందాదారులు జీతం నుండి 10% పెన్షన్‌నిధికి జమ చేస్తే ప్రభుత్వాలు 10%మ్యాచింగ్ గ్రాంటుగా ఇచ్చిన నిధులను ప్రభుత్వ ఆధ్వర్యంలో కాకుండా ప్రైవేటు సంస్థలకు పెన్షన్ ఫండ్ మేనేజర్లుగా నిర్వహించే అవకాశం కల్పించారు. ఈ పెన్షన్ ఫండ్ మేనేజర్లు (పి.ఎఫ్.ఎం)గా ఎల్.ఐ.సి. పెన్షన్ ఫండ్ లిమిటెడ్, యు.టి.ఐ. రిటైర్‌మెంట్ సోల్యూషన్స్ లిమిటెడ్, ఎస్.బి.ఐ. పెన్షన్ ఫండ్ లిమిటెడ్, హెచ్.డి.ఎఫ్.సి., ఐ.సి.ఐ.సి.ఐ. ప్రుడెన్షియల్, రిలయన్స్ కాపిటల్, కోటక్ మహేంద్రలను నియమించింది. ఆ ఫండ్ మేనేజర్‌లు తమకు వచ్చిన నిధులను షేర్ మార్కెట్‌లో 50% ప్రభుత్వ సెక్యూరిటీలలో 30% మరియు ఇతర సంస్థలు జారీ చేసిన బాండ్లలో 20% మదుపు చేసి వచ్చిన లాభం నుండే పెన్షన్ ఇస్తారు. 2008నాటి నుండి పరిస్థితిని పరిశీలిస్తే మదుపరులకు వచ్చిన ప్రతిఫలం అత్యల్పంగా ఉన్నందునే ఈపెన్షన్ స్కీము అమలయిన తర్వాత ఉద్యోగంలో చేరి, దురదృష్ట వశాత్తు మరణించిన వారి కుటుంబాలకు వందల్లో మాత్రమే పెన్షన్ లభిస్తుంది. కుటుంబం జీవించటానికి అవసరమైన కనీస పెన్షన్ కూడ లభించటంలేదు. ఉద్యోగులకు ఉన్న భద్రతను గాలికొదిలి రిస్కుతో కూడిన పథకాలకు మళ్లీస్తున్నారు. రిస్కు ఉద్యోగులది! లాభాలు ఫండ్ మేనేజర్లకు!! ఇప్పటికే చాలా దేశాలు మ్యాచింగ్ గ్రాంటును తగ్గించాయి. భారత ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంటును కొనసాగిస్తుందన్న గ్యారంటీ లేదు. నష్టదాయకమైన NPSను రద్దు చేసి, పాత పెన్షన్ విధానము పునరుద్ధరించేవరకు దీర్ఘకాల మిలిటెంటు పోరాటాలు చేయాలి. అపుడు మాత్రమే రిటైరైన తరువాత భద్రతతో జీవించగలము.

మన దేశంలో పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానమే కొనసాగుతుంది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో సిపిఎస్ విధానం అమలు చేస్తారా? పాతపెన్షన్ విధానంలోనే కొనసాగుతారా అని PFRDA నుండి లేఖ వస్తే ఉద్యోగులతో మాటమాత్రంగానైనా చర్చించకుండా సిపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని వ్రాసి పంపించి, అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నది ప్రస్తుత "ఎంప్లాయీ ఫ్రెండ్లీ ప్రభుత్వం".

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యము వలన 2003 డియస్సీ ఉపాధ్యాయుల, పోలీసు ఉద్యోగాల నియామకాలలో ఆలస్యం జరిగింది. దానితో పాత పెన్షన్ పథకము వర్తించవలసిన వారు కాంట్రిబ్యూటరీ పెన్షన్ లోకి నెట్టబడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాలను సరిచేస్తామంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము 2003 డీయస్సీ అభ్యర్థుల సర్వీసును జూన్ 2004 నుండి నోషనల్‌గా పరిగణించి, వీరికి పాతపెన్షన్ పథకము అమలు చేయాలి.

ప్రస్తుత ఆర్థిక విధానాలు ఇలాగే కొనసాగి, PFRDA చట్టం ప్రస్తుత రూపములోనే యుంటే, 2004కి ముందు నియమించినబడిన వారికి కూడ పాత పెన్షన్ ఇప్పుడున్న ప్రకారము వస్తుందనే గ్యారంటి లేదు. పోరాటాలు ఉధృతంగా కొనసాగిస్తేనే నియామకాల తేదీలతో నిమిత్తం లేకుండా పాతపెన్షన్ విధానము పునరుద్ధరించబడుతుంది. అందుకొరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాలకులు అనుసరిస్తున్న ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలోకి కదిలిరావాలి.

విశాల ఐక్య వేదికల నిర్మాణం ద్వారా ఉధృతమైన పోరాటాలను నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. ఆ క్రమంలోనే ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ **"సిపియస్ రద్దు - పాతపెన్షన్ పునరుద్ధరణ"** కోరుతూ **2016 అక్టోబర్ 1న చలో హైదరాబాద్** కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఈ స్కీమ్ పరిధిలోకి వచ్చే గెజిటెడ్ అధికారి నుండి అటెండర్ వరకు పదవీ వ్యత్యాసాలు లేకుండా సిపియస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెద్దసంఖ్యలో హాజరై పోరాటాన్ని విజయవంతం చేసి, ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కోరుతున్నాము.

**తేది: 16-09-2016**
స్థలం: హైదరాబాదు.

## ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ

**TSUTF, TPTF, DTF, STF, TSPTA, TGHMA, DGTU, BTF, TUTA, TSCSTTA, TGPETA**